సీతయ్య

ఒక ఆలాపన

శ్రీరంగం
శ్రీనివాసరావు

దారిచెయ్యండి. కథానాయకుడికి దారి చెయ్యండి. సీతయ్య వస్తున్నాడు. దారి చెయ్యండి. అమ్మయ్య! ఇక ప్రపంచం తనకు సీతయ్యకథ తెలియదని మూలగడానికి వీలులేదు. అనేకప్రయాసల కోర్చి, ఎన్నోసంవత్సరాలు ఏకదీక్షగా సీతయ్యజీవితం గురించి పరిశోధనలు చేసి తుదకు అసలుకథ చెప్పగలుగుతున్నాను. ఇదివరకు పుకారుగా, చూచాయగా ఇక్కడో చిన్నసంగతీ, అక్కడో చిన్నరహస్యం, ఎవరో అనుకున్న మాటలూ, ఎక్కడో చదివిన వార్తలూ మాత్రమే లోకానికి తెలుసును. ఇక మరి భయం లేదు. సీతయ్యను గురించిన భోగట్టాయావత్తూ పోగుచేశాను. సరే. కొంత కష్టపడవలసి వస్తేనేం? అదో లెక్కలోనిది కాదు. లోకానికి నిజం తెలియజెయ్యగలుగుతున్నాను కదా! అందుకు లోకం హర్షిస్తే అదే నాబహుమానం.

ఈ సీతయ్య! ఇతగాడి సంగతి నాకు తప్ప మరెవ్వరికీ పూర్తిగా తెలియదన్న కారణంవల్ల నాకు కాస్త గర్వం కలగడం సహజమే. ఇన్నాళ్లకు నేనొక విషయంగురించి పరిపూర్ణజ్ఞానంతో మాట్లాడగలుగుతున్నాను. దీన్నెవరూ కాదనలేరు. నామాటే శిలాక్షరం; వేదవాక్యం. సీతయ్యసంగతి మాట్లాడుతున్నంతసేపు నే నొక్కణ్నే జ్ఞానిని. మిగిలినవాళ్లంతా నాదగ్గరకు రావాలి.

సీతయ్యగురించి నాకంటెఎక్కువ తెలిసినవాళ్లెవరూ లేకపోవడంచేత నే నేమిచెప్పినా కిక్కురుమనకుండా మీరు నమ్మితీరాలి. అయితే మీరు నమ్ముతారుకదా అని నాయిష్టంవచ్చినన్ని అబద్ధాలు గుచ్చెత్తి మీముందు పొయ్యవలసినవాణ్ని కాను. నేను వ్రాస్తున్నదానిలో కాస్తైనా అబద్ధం ఉన్నట్లు మీకు ఆచోకీ దొరికిందంటే నాశిల్పమే భగ్నమయిపోయిందన్నమాట. శిల్పంవిషయమై నేను చాలాజాగ్రత్త తీసుకుంటానని మీకు వేరేచెప్పాలా? అందువల్ల నేను త్రాటిమీద నడుస్తున్నట్లుగా, అసిధారావ్రతంగా సంచరించాలి.

ఈ సీతయ్య! వీడి పరిపూర్ణచిత్రం మీముందు ఉంచాలనే ఈ వ్రాతకు ఉపక్రమించాను. నేను చిత్రకారుణ్ణి. అయితే వర్ణలేపనంతో కాదు నాప్రసక్తి. 'వర్ణ' లేపనంతో. అనవసరంగా ఒక్క రేఖగాని ఒక్క ఊర్పుగాని వ్యయంచేస్తే నాశిల్పం ధ్వంసం అవుతుందని నాకు తెలుసు. కాని పాటగాడు సంగీతం అందుకునేముందు రసావస్థపొలిమేరలలో కూనిరాగంతో తచ్చాడుతూ ఉంటాడు. ఆత్మహత్య చేసుకునేవాడు నీళ్లలో పడడానికి ముందు ఒడ్డున పచారు చేస్తాడు. ప్రేయసీప్రియులు... సరే. ఉదాహరణలతో మిమ్మల్ని విసిగించను. అన్నీ మీకు తెలిసినవేకదా!

సీతయ్య సంగతి ఒక్కటే మీకు తెలియదు. నే నంతా చెప్పిన తర్వాత మాత్రం 'ఓ, మాకు తెలుసు. ఫలానా చోట చూశాం. వీడు మాకు పరిచితుడే!' అంటారు. కాని నికరంగా ఏదీ నేను చెప్పనంతసేపు మీఆదుర్దా అరికట్టుకొంటున్నాను. అదీ కాక సీరియస్‌గా కథ చెప్పుతున్నాననుకొంటూ పాఠకుణ్ణి మరిచిపోయే కథకుడు ఎన్నటికీ క్షంతవ్యుడు కాడు. ఎంతసేపూ తనపాత్రల వ్యవహారాలలో మునిగిపోయి ఇతడు తనకు కొందరు పాఠకు లుంటారనీ వారిని కొంచెం గిలిగింతపరచడం అవసరమనీ మరిచిపోతాడు. అదే నా కిష్టం లేదు. అవసరమైతే ఎంత ముఖ్యపాత్రనైనా వదలి పాఠకుని ఔత్సుక్యాన్ని ఆకర్షించుకోవాలి.

ఇప్పుడు సీతయ్యగురించి నిజం మీకు తెలిసిందా? స్వయంగా చెప్పడాని కేమీ లేనప్పుడూ, బహుశా ఇష్టం లేనప్పుడూ నేనుచేసే తంత్రం: సీతయ్య నాచేతిలో యంత్రం. సంభాషణ తిరగడానికి 'కీ' సీతయ్య. సీతయ్య నా హార్మోనియం పెట్టె. కేరమ్ బల్ల.

ఇంకా స్పష్టంగా చెప్పాలంటే సీతయ్యంటూ ఎవడూ ఒకవ్యక్తి లేడండీ! ఇందాకా పరిశోధనలనీ ప్రయాసలనీ అన్నానే అవన్నీ కథారచనకు నేను పడ్డ పాట్లుమాత్రమే. ఓ గొప్ప కథానాయకుణ్ణి సృష్టించు

దామని నేను చాలా యత్నించిన మాట వాస్తవమే. ఇంత సేపూ సీతయ్య ఒక యథార్థవ్యక్తి అనీ వాడిగురించి యావత్తూ నాకు తెలుసుననీ మీలో ఒక అభిప్రాయం కలిగించాను. మరి నేను సృష్టించే పాత్రగురించి నాకంటె ఎక్కువ ఎవరికి తెలుస్తుంది చెప్పండి? ఇక వ్యక్తుల యాథార్థ్యం! దీనివిషయమై మీరు అట్టే పట్టింపుచేస్తే మీలో వేదాంతం చాలా తక్కువని ఋజువై పోతుంది.

ఇది కేవలం మోసం అని మీరు తిరగబడవచ్చును. పైగా 'సీతయ్య'ను గురించి తెలుసుకుందామని మే మీ పూట త్రిప్పాముగాని నీ ఉపన్యాసం వినడానికా? అని మీ రడగవచ్చు. సీతయ్య గురించి తెలుసుకోకపోతే మీకేం లోపం వచ్చిం దని నే నడుగుతే?

కేవలం కుతంత్రాలతో మిమ్మల్ని నిలబెడుతున్నానుకాదూ? పాపం! మీ అమూల్యమైనకాలం వ్యర్థపుచ్చుతున్నాను. లేకుంటే ఈ లోపున మీరు మరేదో చదువుకొని ఉందురు. పద్యం, విమర్శ, తమాషాలు, వార్తలు, ఏవో! ఏవో! ఇప్పటికే మీకు కొంత విసుగుపుట్టి తటాలున తర్వాతిపుటలకు పోదామని ఉంటుందికాని 'సీతయ్యగురించి పూర్తిగా తెలుసుకొని మరీపోదాం, ఎలాగూ రానే వచ్చాం' అనే ఆస్థ పీకుతూ ఉంటుంది. కల్పితవ్యక్తి అయితేనేం? కథ బాగుంటే చాలునని నిలబడతారు.

కాని ఇంతట్లో సీతయ్య గురించి చెబుతానని మీ రనుకుంటే చాలా పొరపాటుపడ్డవా ళ్లవుతారు. నిజానికి నేను సీతయ్య వ్యవహారం వెనక పెడుతున్నానంటే దానికి కొంత కారణం లేకపోలేదు. కథంతా నాలుగుముక్కల్లో తెమిల్చి 'అయిపోయింది' అని నేను ఆఫీసు మూసి వెయ్యవచ్చును. అదో కష్టమైన పని కాదుకూడా! కాని నే నలా చెయ్యను. నా కథకు నాయకపదవికి నోచుకున్నవాడు చాలా అదృష్టవంతుడు. ఒకంతకుగాని బైటపడడు. అలా, అలా, నాపాఠకులలో ఔత్సుక్యం పెంపొందించి తంటాలు పెడతాడు. ఈ ఔత్సుక్యం విసుగుదలగా మారి కొందరు పాఠకులు నన్ను తిట్టుకుంటున్నా కొంతమందిమాత్రం తెల్లవార్లూ జాగరంచేసినా ఈసంగతేదో తేల్చుకుందామని కూర్చుంటారు. వాళ్లూ అసలైన ఆంధ్రులు! అలాంటి వాళ్లే దేశానికి కావాలి.

చూశారా, మరినే నెలాగ మిమ్మల్ని నిలుపగలుగుతున్నానో? ఈమాటు మీ దేశాభిమానం రెచ్చగొట్టుతున్నాను. ఇవన్నీ మామూలు పద్ధతులే అనుకోండి. కాని వీటికి మీరు లోబడిపోవడం మాత్రం ఆశ్చర్యం కాదూ?

ఇక నట్టే శాఖాచంక్రమణం చెయ్యక సీతయ్యమాట మొదలుపెడదామా అని ఉంది. కాని అతనికి ఆకారం ఇయ్యడంతోనే శాశ్వతంగా ఒక పోతవిగ్రహం అయిపోతాడు. అటువంటప్పుడు అన్నివిధాలా యోజించి సృష్టించబోయే బొమ్మకు రూపం కల్పించి ప్రాణం పొయ్యాలి. ఇతగాడు సాహిత్యంలో ప్రసిద్ధిపొందిన మహావ్యక్తులతో తులతూగాలంటే అశ్రద్ధగా వెళ్లకూడదు. Falstaff, Don Quixote మొదలైనవాళ్లలాగు మనసీతయ్యను హాస్యవ్యక్తిని చేదామా అని ఒక ఆలోచన. చేసినా చెయ్యొచ్చు. అదేమీ కష్టంలోని పనికాదు. అయితే తీరా ప్రారంభించివేస్తే తర్వాత మనస్సు మారిపోయి Hamlet, Othello మొదలైనవాళ్లలాగు వీడినొక Tragichero గా చేశానుకానే అని కించ కలుగుతుంది. అందువల్ల ఎంతమాత్రమూ తొందరపడిపోకూడదు.

మరో విశేషం. చెప్పకేంగాని నేను వచనం వ్రాస్తున్నా నా హృదయాంతరంలో మట్టుకు కవిత్వం అంటే మహా అభిమానం. అందువల్ల ఈ సీతయ్యను Byronలో లాగ ఒక కావ్యనాయకుణ్ణిచేస్తే ఎలా ఉంటుందో అనిపించుతోంది, Don yuan, Childe Harold, Giaourల్లాగ, కాళిదాసు యక్షుడూ, మిల్టన్ సైతానూ, పెద్దన్నగారి ప్రవరుడూ, పాండురంగ కపి నిగమశర్మా వీళ్లలో యెవరిలాగైనా బతికిపోయిఉండును. కాని సీతయ్య అని మగపేరు పెట్టకపోతే 'చింతామణి' 'సక్కుబాయి' 'బాల యోగిని' అంటూ మోహకల్పన కవ

కాశం ఉండును! తీరా ఇక విచారిస్తే లాభ మేమిటి? స్త్రీవాచకం అయిందా మరి. తీర్యగ్లోకంలోకీ, జడపదార్థాలలోకీకూడా భావనావిహారంచేస్తే మనం తేలడ మెలాగు?

అయితే సీతయ్య చాలా మొగమాటపు మనిషి. గొప్పగొప్పవాళ్ల పక్క కూచోడానికి తాను అర్హుణ్ణి కానని ఎరుగును. అదీకాక వాళ్లంత వాళ్లు వాళ్లు, నా అంతవాణ్ణి నేను అనే స్వాభిమానం ఉన్నవాడు కూడాను. మరిన్నీ తాను పూనుకుంటే సులువుగా గొప్పవాణ్ణే కాగలననే రకంలోవాడు. ముఖ్యంగా ఎవడైనా గ్రంథకర్తకు తనజీవితం అప్పగించి నన్ను గొప్పవాణ్ణి చెయ్యవయ్యా అంటే అతనే చేస్తాడు తగుమాత్రం ఫీజుతో. గొప్పవాళ్లు కావడానికి ఈ కాలంలో అట్టే శ్రమపడవలసిన అవసరంకూడా లేదు. ఓపత్రికకు ఫొటో పంపించడం, మరోపత్రికకు వ్యాసం వ్రాయడం, ఓ ఊళ్లో ఉపన్యాసం ఇవ్వడం ఒక సమావేశానికి వెళ్లకపోతే జయం కోరుతూ సందేశం పంపడం, వెళితే సభకు వచ్చిన వారిలో ముఖ్యులు అనిపించుకోవడం ఎన్నో చవకపద్ధతు లున్నాయి. సీతయ్య కివేమీ ఇష్టం లేకపోబట్టి కాని లేకపోతే అబ్బో, ఇంకా మీకు సీతయ్యసంగతి తెలియదు.

ఇక వాఙ్మయంలో శాశ్వతంగా జ్ఞాపకం ఉంచవలసిన వ్యక్తికి ఫలానా లక్షణాలు ఉండాలని ఎవ్వరూ నిర్దేశించలేదు. నాయకుల గురించిన విభాగాలలో మనవాళ్లు ధీరోదాత్తుడూ, ధీరలలితుడూ అంటూ కొన్ని లక్షణాలు చేసినా Victor Hugo సృష్టించిన Quasimodo అందానికీ, Dostoievski సృజించిన Idiot తెలివికీ క్రొత్త జాబితాలు వేసుకోవాలి. నాలుగు రోజులు భూమిమీద ఉండి పేరు లేకుండా పోయిన వాళ్లందరి కన్నా వీరిని మనం జ్ఞాపకం ఉంచుకుంటామా, లేదా?

ఇందువల్ల సీతయ్యకు గొప్ప గుణాలున్నాయనీ, గొప్ప కార్యాలు చేశాడనీ మీరు వాడిని స్మరించనక్కరలేదు. ఎవరెస్టు ఎక్కడం, సముద్రాలు దాటడం, భూప్రదక్షిణం చెయ్యడం గొప్ప కార్యాలే. పద్యాలు వ్రాయడం, సినిమాలో నటించడం, విషవాయువులు కనిపెట్టడం గొప్పకార్యాలే. ఇవన్నీ మన సీతయ్య చేశాడంటే వెంటనే నే నబద్ధాలు వ్రాస్తున్నానని మీరు పోల్చేస్తారు. సీతయ్య కివేవీ చేత కావని మీకు తెలుసును.

అయితే 'ఎవరయ్యా ఈ సీతయ్య? వీడిని మేమెందుకు తెలుసుకోవాలి?' అని మీ రడుగుతారు. మీ రడుగుతున్న కొద్దీ నాలో డేవిల్రీ హెచ్చి ఏమి చెప్పడానికీ ఇష్టం కలగదు. ఈ ఆలాపనలో ఇంకా ఎన్నో సంగతులు పడతాయి.

ఈసీతయ్యతో నేను ఎంతపనైనా చెయ్యగలను. వీడు నాసృష్టి. పూర్తిగా నాచెప్పు చేతలలో మెలగవలసినవాడు. 'సీతయ్యా! నువ్వు ఫలానారకం వ్యక్తివి' అంటే 'ఔ'నని ఒప్పుకుంటాడు. 'నిన్ను ఫలానా పరిస్థితులలో పెడుతున్నాను; ఎలాసంచరిస్తావో' అంటే 'నీయిష్టం!' అంటాడు. సీతయ్యను ఎలక్షన్‌కి నిలబెట్టి గెలిపిస్తాను. టైఫాయిడుజ్వరం వచ్చిందని ఆసుపత్రిలో ప్రవేశపెడతాను. 'సీతయ్యా! నువ్వు పదిరూపాయల టిక్కెట్టు కొనుక్కొని ఆంధ్రదేశమంతా తిరగాలంటే 'సరే' అంటాడు. అయితే వీటివల్ల సీతయ్యకు వచ్చిన ప్రత్యేకత యేమిటి? ఓ అదా! ప్రత్యేకత కూడా కలిగించే సన్నివేశాలు దొర్లించవచ్చు. అదో కష్టం లోపని కాదు.

ఏ మాత్రం నేను సీతయ్య గురించి స్పష్టంగా చెప్పినా నా ప్రయత్నం పాడయిపోతుంది. ఇప్పటికే చాలాసంగతులలో సీతయ్య వ్యక్తిత్వం కనబడిపోతున్నది. ఇంకా స్ఫుటవర్ణాలు ఉపయోగించి వీడిని చట్రంలోకి దింపడం అన్యాయం. ఒక నీడగా, మబ్బుగా, దోబూచిగా సీతయ్యను వదిలేస్తున్నాను. వీడికి రూపం ఇచ్చి, గుణాదులు కల్పించి, సంఘటనలలో నిలిపి కథ నడిపించాలన్నా నడిపించవచ్చు. అదో కష్టమైనపని కాదుకూడా!

———o———